ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
సోమవారం 24 ఫిబ్రవరి 2025 | 5



నీ వెంటే.. నేనమ్మా..

అద్వితీయంగా రాయండి!



ఆల్ ది బెస్ట్..వదలొద్దు

7 ఆల్ ది బెస్ట్.. పరీక్ష బాగా రాయాలమ్మా.. వదలొద్దు ఒక జాబ్ మనదే కావాలి.. కంగారుపడొద్దు పరీక్ష జాగ్రత్తగా రాయండి.. తదితర మాటలు గ్రూప్ -2 పరీక్షా కేంద్రాల వద్ద వినిపించాయి.. కనిపించాయి.. ఆదివారం కాకినాడలో 12 కేంద్రాల్లో గ్రూప్ పరీక్షలు నిర్వహించారు.. 9,379 మంది అభ్యర్థులకు 8,167 మంది పరీక్ష రాశారు...7లో

భళారే..బాలకా!

చిన్నారులా మజాకానా.. ఒక వేదిక ఇచ్చి మీ ఇష్టం అంటే ఏం చేస్తారు..రెప్పవాల్చనీయకుండా.. తమ టాలెంట్‌తో కట్టిపడేస్తారు.. భళారే అని పించుకుంటారు.. ది కాకినాడ చిల్డ్రన్స్ థియేటర్, దంటు సూర్యారావు స్మారక నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం దంటు కళాక్షేత్రం ప్రాంగణంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో చిన్నారులు అదే చేశారు.



చిన్నారుల షో

7

అన్నవరం సత్యదేవుడి ఆలయంలో భో..ఫోర్స్ కుంభకోణం అంత పెద్ద కుంభకోణం జరుగుతోంది.. ఇది ఈ నాటిది కాదు.. చాలా ఏళ్లగా వేళ్లూనుకుపోయింది.. అయినా ఏ ఒక్కరూ దీనిపై దృష్టి సారించినవారే లేరు.. అయితే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన ఆలయాల్లో భక్తులకు అందించే సౌకర్యాలపై చేపట్టిన ఐవీఆర్ఎస్ సర్వేలో చివరి స్థానానికి చేరడంతో అందరి దృష్టీ ఈ ఆలయంపై పడింది.. ఇది జిల్లాకు మాయని మచ్చగా మారింది.. దీనిపై 'ఆంధ్రజ్యోతి' నిఘా పెట్టగా అసలు విషయం బయటపడింది.. తవ్వితే బోఫోర్స్ కుంభకోణం అంతగా ఉంది.. ఇదిలా ఉండగా ర్యాంక్ మెరుగుపరిచేందుకు అన్నవరం ఆలయంలో ఏం జరుగుతోందో తెలుసుకునేందుకు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం అన్నవరం ఆలయంలో సమీక్షించేందుకు సిద్ధమయ్యారు.



అన్నవరంలో.. బో..ఫోర్స్!

4 ప్రధాన విభాగాల్లో దోపిడీ

- కంటున్నావా.. సత్యదేవా
- ఐవీఆర్ఎస్ సర్వేలో చివరి స్థానం
- లోపమెక్కడని ఆంధ్రజ్యోతి ఆరా
- దోచుకుంటున్న దళారులు
- దర్శనమైనా..గదులైనా డబ్బులే
- మామూళ్ల మత్తులో అధికారులు
- నేడు కలెక్టర్ సమీక్ష

అన్నవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో పనిచేసే సిబ్బందిలో చాలా మంది తమ జేబులు నింపుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. అర్చకుల నుంచి క్యూలైన్‌లో నిలబెట్టేవారు వరకూ అందరూ చేయి చాపే వారే. చేయి తడిపితేనే దర్శనం చేయించేంతగా అవినీతి వేళ్లూనుకుపోయింది. అన్నవరం వచ్చిన భక్తులు అడుగడుగునా దోపిడీకి గురవుతున్నారనే విమర్శలున్నాయి. మిగిలిన ఆలయాల్లో భక్తులు పరోక్ష దోపిడీకి గురవుతుండగా రత్నగిరికి విచ్చేసిన భక్తులు ప్రత్యక్ష దోపిడీకి గురికావడమే చివరి ర్యాంక్‌కు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. దీనికి ప్రధాన కారణం దళారీ వ్యవస్థ. ఎక్కడికక్కడే దళారులు కొంత మంది సిబ్బందితో కుమ్మక్కై భక్తులను దోచుకుతింటున్నారు. సిబ్బంది కూడా పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీనిపై కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం జరిగే సమీక్షలో అవలోకనం చేస్తే భక్తులు సంతృప్తి చెందవచ్చు. ఇక్కడ భక్తులు ప్రత్యక్షంగా దోపిడీకి గురవుతున్నది నాలుగు విభాగాల్లో మాత్రమే.

1 దళారీ..దేముళ్లు!

స్వామివారి దర్శనాలు, వైదిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాటైన ఈ విభాగంలో దళారీ వ్యవస్థదే కీలక పాత్ర. రత్నగిరికి కార్లలో వచ్చే భక్తులనే దళారులు టార్గెట్‌గా పెట్టుకుంటారు. కారు పార్కింగ్ చేయగానే మీకు నేరుగా దర్శనం చేయిస్తామని, గర్భగుడిలో అర్చకులతో మెడలో పూలమాల వేయిస్తామని బేరసారాలు జరుపుతారు. ఒక్కొక్కరి వద్ద రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు లాగేస్తారు. బేరమయ్యాక దళారులు ఎస్ఎంఆర్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఫోన్ చేస్తారు. భక్తబృందాన్ని వారికి అప్పగిస్తారు. దర్శనం అయ్యాక ఎస్ఎంఆర్, కాంట్రాక్ట్ ఉద్యోగి డబ్బులను పంచుకుంటారు. ఈ తతంగమంతా సెక్యూరిటీ సిబ్బందికి తెలిసినా... వారు దళారీలతో ముచ్చటిస్తూ ఇంటికెళ్లే సమయంలో వారికి కొంత భాగమిస్తారు. ప్రకాష్ సదన్ కాటేజీ నుంచి పశ్చిమ రాజగోపురం వరకు దళారులు తిరుగుతుంటారు.

2 చేయితడిపితేనే.. వ్రతఫలం

సత్యదేవుడి సన్నిధికి విచ్చేసే భక్తుల్లో అధిక శాతం స్వామివారి వ్రతాలు చేస్తారు. సామాన్యుల వ్రతం టిక్కెట్టు ధర రూ.300 అయితే పూర్తయ్యేసరికి మూడింతలు ఖర్చవుతుంది. టిక్కెట్టు రూ.300, వ్రతం పూజా సామగ్రి రూ.300, వ్రతం పూర్తయ్యాక పురోహితులకు దానాల రూపంలో స్వీకరించేది మరో రూ.300. ఇది కాకుండా వ్రతం అనంతరం శానిటేషన్ సిబ్బంది మూకుమ్మడిగా వ్రత మండపాల్లోకి వెళ్లి తాము స్వీపర్‌లమని యాచిస్తుంటారు. రత్నగిరి భక్తులు సగం ఛీత్కరించుకునేది ఇక్కడే.

3 ఛీ..ఆర్వో విభాగం

ఈ విభాగం కింద భక్తులకు వసతి గదులు కేటాయింపు జరుగుతుంది. పర్వదినాల్లో సాధారణ భక్తులకు కౌంటర్ గుమస్తాలు నరకం చూపిస్తారు. గదులు ఖాళీలు ఉన్నా సాధారణ భక్తుడికి గదులు ఇవ్వరు. అక్కడే ఉండే దళారులను సంప్రదించి కొంత అధిక మొత్తం చెల్లిస్తే మాత్రం వెంటనే గది దొరుకుతుంది. కేవలం రత్నగిరిపై 550 గదులు మాత్రమే ఉన్నాయి. సిఫార్సులు అధికం. దీంతో ఇక్కడ సామాన్య భక్తుడికి గది దొరకడం అసాధ్యం. ఇక్కడే వివాహ బృందాల దోపిడీకి దళారీ వ్యవస్థ కాచుకుని కూర్చుంటుంది. పురోహితుడు, సన్నాయిమేళం బేరం కుదుర్చుకుంటేనే వారికి లోపల ప్రవేశం ఉంటుంది. లేకుంటే అష్టకష్టాలే. దశాబ్దాలుగా ఇక్కడ దళారీ వ్యవస్థ వేళ్లూనుకుపోవడంతో ఎవరూ వారిని కదిలించలేకపోతున్నారు. వివాహ బృందాలకు స్వేచ్ఛ దొరకనివ్వకపోవడంతో దేవస్థానం అపఖ్యాతి పాలవుతోంది.

4 గలీజుల విభాగం!

భక్తుల సౌకర్యార్థం స్టాళ్లను ఏర్పాటు చేసే విభాగమే లీజుల విభాగం. దీన్ని సీ సెక్షన్‌గా పిలుస్తారు.ఇక్కడ దేవస్థానం నిర్దేశించే ధరలు అమలు జరగవు. ఉదాహరణకు సెల్‌ఫోన్ భద్రపరుచుకునేందుకు లైసెన్స్‌దారుడు ఒక్కో ఫోన్‌కు రూ.5 వసూలు చేయాలి ఇక్కడ రూ.10 వసూలు చేస్తాడు.ఇటీవల వినియోగదారుల కమిషన్ సైతం సదరు గుత్తేదారుపై జరిమానా వేసింది.మరోపక్క భక్తుల జోళ్ల జతకు రూ.2 వసూలు చేయాలి ఇక్కడ రూ.5 వసూలు చేస్తారు.పూజాసామగ్రి ధరలు, వివాహాలకు అవసరమైన డెకరేషన్ మండపాల ధరలు దేవస్థానం నిర్దేశించిన దానికంటే మూడింతలు ఎక్కువ.ఎక్కడా షాపుల వద్ద ధరల పట్టికలు ఉండవు. లీజుల విభాగం అధికారులు దీనిపై దృష్టిసారించరు. ఎందుకంటే మామూళ్ల మత్తు.ఎంఆర్‌పీ ధరలతో విక్రయాలు జరగవు. మామూళ్ల మత్తులో అధికారులు ఊగుతుండడం దౌర్భాగ్యంగా పేర్కొనవచ్చు.



చిత్రాడలో ఎస్‌బీ లే-అవుట్‌ను పరిశీలించి చర్చిస్తున్న జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తదితరులు

జనసేన ఫస్ట్ షో

- మార్చి 14న జనసేన ప్లీనరీ
- అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి సమావేశం
- అధినేత పవన్ దిశానిర్దేశం
- చిత్రాడలో వేదిక ఖరారు
- ఒకే రోజు నిర్వహణ
- ఏర్పాట్లు చేస్తున్న నేతలు

పిఠాపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జనసేన ప్లీనరీని ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నారు. మార్చి 14న జనసేన ప్లీనరీని పిఠాపురం నియోజకవర్గంలో నిర్వహించాలని ఇప్పటికే పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిర్ణయించారు. ఆ మేరకు ఏర్పాట్లు చేయాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. జనసేన పార్టీ నూరుశాతం స్ట్రైక్‌రేట్‌తో అధికారంలోకి రావడం.. అధికారంలో భాగస్వామ్యమైన తర్వాత తొలి ప్లీనరీ కావడంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని భావిస్తున్నారు. ఈ ప్లీనరీకి ఏపీ, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి జనసైనికులు భారీగా తరలివచ్చే అవకాశం ఉంది.ఈ మేరకు కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ శివారులో 216వ జాతీయ రహదారి చెంతనే ఉన్న 80ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న ప్రైవేటు లేఅవుట్ (ఎస్‌బీ సిటీ) జనసేన ప్లీనరీకి వేదిక కానుంది. ఉదయం ప్లీనరీ సమావేశాలతో పాటు సాయంత్రం ఇక్కడే బహిరంగ సభ నిర్వహించనున్నారు.వాహనాల పార్కింగ్, వచ్చే నాయకులు, ముఖ్యఅతిథులు, కార్యకర్తలు భోజనాలు చేసేందుకు అనువైన ప్రాంతంగా దీన్ని గుర్తించారు.ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు జనసేనలోని ముఖ్య నాయకులు హాజరుకానున్నారు. అక్కడ ఏ విధమైన ఏర్పాట్లు చేయాలన్న అంశంపై పార్టీ నాయకులు పరిశీలన జరిపారు. గతంలో మాదిరిగా మూడు రోజులు కాకుండా ఒకే రోజు ప్లీనరీ కావడంతో అక్కడే ఉదయం పార్టీ ప్రతినిధుల సమావేశం, సాయంత్రం బహిరంగ సభ నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. పార్టీ రాష్ట్ర నేతలు మరోమారు పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటారు.. ప్లీనరీ వేదికను జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు,గోదావరి ఈస్టర్న్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, రాజమహేంద్రవరం జనసేన అధ్యక్షుడు వై.శ్రీనివాస్, ఇతర నాయకులు పరిశీలించారు. ప్లీనరీ, బహిరంగ సభల నిర్వహణ, వాహనాల పార్కింగ్ తదితరాలకు అక్కడ ఉన్న ప్రదేశం ఎంత వరకూ సరిపోతుందనే అంశంపై అంచనాలు వేశారు. నెలాఖరు లేదా మార్చి 1న పార్టీ ముఖ్యనేతలు పిఠాపురం వస్తున్నట్టు సమాచారం. వీరు వచ్చి పరిశీలన జరిపి తుది నిర్ణయం తీసుకున్న తర్వాత ఏర్పాట్లు వేగవంతమయ్యే అవకాశాలు ఉన్నాయి.



అభినందన సత్కార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్

అంతర్వేది కల్యాణోత్సవాలను వచ్చే ఏడాది

రాష్ట్ర పండుగగా నిర్వహిస్తాం

రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

అంతర్వేది, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలను ప్రతి ఇంటా పండుగలా చేసుకునేందుకు 2026లో రాష్ట్ర పండుగలా నిర్వహిస్తామని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. కల్యాణోత్సవ మండప ప్రదేశంలో ఆదివారం నిర్వహించిన అభినందన, సత్కార సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 22 శాఖల సమన్వయంతో ఉత్సవాల నిర్వహణ అద్భుతంగా జరిగిందన్నారు. కలెక్టర్, ఎస్పీ, దేవదాయ శాఖ, ఉత్సవ సేవా కమిటీ సంయుక్త నిర్వహణలో లక్షలాది మంది భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి దర్శించుకుని వెళ్లారన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయాన్ని కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామని తెలిపారు. భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా చూశామన్నారు. పారిశుధ్యం, తాగునీరు, రవాణా, బందోబస్తు, అన్నసత్రాల నిర్వహణ, వైద్య, ఇతర శాఖల పనితీరు గతంలో కంటే మెరుగ్గా ఉందన్నారు. భవిష్యత్తులో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో కల్యాణోత్సవాలను రాష్ట్ర పండుగలా నిర్వహించేందుకు కలసికట్టుగా కృషి చేద్దామన్నారు. ఉత్సవాల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, గోదావరి డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, రాపాక రమేష్‌బాబు, తాడి మోహన్‌బాబు, ఆకన బాబ్జీనాయుడు, పోతురాజు సురేష్, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీటీసీ బైరా నాగరాజు, కూటమి శ్రేణులు, ఉత్సవ సేవా కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలో సత్తెమ్మ తల్లి తీర్థం ఆదివారం వైభవంగా జరిగింది. బాజాభజంత్రీలు, బ్యాండు మేళాలు, గరగ నృత్యాలు, భారీ బాణసంచా కాల్పులు, బుట్టబొమ్మల వేషధారణల మధ్య అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు....8లో



ఘనంగా సత్తెమ్మ తల్లి తీర్థం



మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సోమశేఖరరావు

ఇంటర్ పరీక్షలకు 40 కేంద్రాలు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మార్చి 1 నుంచి జరిగే ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు జిల్లాలో 40 కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. ఆదివారం అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు నియమించిన ప్రిన్సిపాల్స్, అధ్యాపకులతో ఆయన సమావేశం నిర్వహించారు. పరీక్షలను బాధ్యతాయుతంగా చేపట్టాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, సీసీ కెమెరాల నిఘాలో ఉంటుందని వివరించారు. పరీక్షా కేంద్రాలకు ఎవరూ సెల్‌ఫోన్లు తీసుకురాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు మాత్రం ఇంటర్మీడియట్ విద్యా మండలి సరఫరా చేసిన సాధారణ ఫోన్లను పరీక్షలకు సంబంధించిన సమాచారం కోసం మాత్రమే వినియోగించాలని సూచించారు. సమావేశంలో జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు వై.లక్ష్మణరావు, ఎం.రామారావు, కె.శ్రీనివాసరావు, బల్క్ ఇన్‌చార్జి డి.శ్రీనివాసరావు, జూనియర్ అధ్యాపకుల సంఘ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అంతర్వేది ఆలయానికి పోటెత్తిన భక్తులు


8



అమలాపురం మార్కెట్‌లో బర్డ్‌ఫ్లూ ప్రచారంతో వెలవెలబోతున్న కోళ్ల విక్రయ కేంద్రాలు

అక్కడ వెలవెల





అమలాపురంలో ఫిష్ మార్కెట్, మటన్ షాపుల్లో జనం రద్దీ

ఇక్కడ కళకళ

- బర్డ్‌ఫ్లూ వైరస్ వ్యాప్తి ప్రచారంతో నిలిచిన కోడి మాంసం అమ్మకాలు
- ఫిష్, మటన్ మార్కెట్లలో పెరిగిన రద్దీ
- ధరలు పెంచి వినియోగదారులను దోచుకుంటున్న వ్యాపారులు
- చికెన్ లేక మూతపడిన హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు
- కోడిగుడ్డుకు పెరుగుతున్న గిరాకీ

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

బర్డ్‌ఫ్లూ వైరస్ ప్రచారంతో కోడి మాంసం అమ్మకాలు నిలిచిపోవడం వల్ల మాంసాహార ప్రియులు చేపలు, మటన్ మార్కెట్‌లపై పడ్డారు. దీనిని గ్రహించిన విక్రయదారులు వాటి ధరలను పెంచి ప్రజలను నిలువుదోపిడీ చేస్తున్నారు.

బర్డ్‌ఫ్లూ వ్యాప్తి కారణంగా జిల్లాలో కోడి మాంసం అమ్మకాలు 15 రోజులుగా పూర్తిగా నిలిచిపోయాయి. ఫలితంగా కోళ్ల తయారయ్యే ఫారాలు, విక్రయించే హోల్‌సేల్, రిటైల్ షాపులతో పాటు కోడిమాంసం ఆధారంగా నిర్వహించే నాన్ వెజ్ హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, కోడిమాంసం దుకాణాలు మూతపడ్డాయి. వాటిపై ఆధారపడి జీవించే వందలాది మంది ఇప్పటికే ఉపాధి కోల్పోయారు. షాపులు మూసివేశారు. అయితే ప్రజలు చికెన్‌వైపు ఇంకా దృష్టి సారించకపోవడంతో కోళ్లఫారం యజమానులు చికెన్ బిర్యానీలు, డ్రై ఐటెమ్స్ చేసి మేళాలు కూడా నిర్వహిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. జిల్లాలో ఎక్కడా బర్డ్‌ఫ్లూ లేదు. కోడి మాంసం తినొచ్చు. కోడిగుడ్లను కూడా తినండంటూ జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే అధికారికంగా ప్రకటనలు జారీ చేసినప్పటికీ ప్రజలను బర్డ్‌ఫ్లూ భయం వేధిస్తోంది. పెళ్లిళ్లు, ఇతర కార్యక్రమాల్లో దాదాపు చికెన్ ఐటెమ్ లేకుండానే విందు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సముద్రం, గోదావరిలో లభ్యమయ్యే చేపలు, రొయ్యలు, పీతలు వంటి అనేక రకాల మత్స్య సంపదకు అనూహ్యమైన డిమాండ్ పెరిగింది. దాంతో ఆదివారం వస్తే చాలు ఫిష్ మార్కెట్లు వినియోగదారులతో కిక్కిరిసిపోతున్నాయి. సందువా, పండుగొప్ప, కోనం వంటి చేపల ధర గతంలో కిలో రూ.400 ఉండేది. ఇప్పుడు ఏకంగా రూ.700 పైమాటే. కిలో రొయ్యలు రూ.300పైనే ధర పలుకుతున్నాయి. మటన్ సంగతికి వస్తే గతంలో కిలో రూ.800 ఉండగా ఇప్పుడు డిమాండ్‌ను బట్టి రూ.900 నుంచి రూ.వెయ్యి వరకు వసూలు చేస్తున్నారు. కోడిగుడ్డు గతంలో రూ.7పైనే ఉండగా ప్రస్తుతం రూ.6కు దిగింది. కోడిగుడ్ల వినియోగం మార్కెట్‌లో బాగానే పెరిగినట్టు వ్యాపారులు చెప్తున్నారు. హోటళ్లు, బేకరీలు వంటి వాటితో పాటు వంటకాల్లో బాగా పెరిగింది. చికెన్ లేకపోవడంతో ప్రజలు మళ్లీ గుడ్డువైపు మొగ్గుచూపుతున్నారు. మటన్, ఫిష్ మార్కెట్లలో ధరలను అనూహ్యంగా పెంచడంతో మాంసాహారుల జేబులు ఖాళీ అవుతున్నాయి. ధరలు పెంచితే కఠినచర్యలు చేపడతామని అధికారులు హెచ్చరించినప్పటికీ వ్యాపారులు ఏమాత్రం పట్టించుకోవట్లేదు.

భళా బాల!



కాకినాడ దంటు కళాక్షేత్రంలో జరిగిన మూకీ ప్రదర్శన

- ఉత్సాహంగా చిన్నారుల రాష్ట్రస్థాయి నాటికలు, సాంస్కృతిక పోటీలు
- రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన చిన్నారులు



చిన్నారుల జానపద నృత్యం



విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తున్న దృశ్యం

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): నాటికలు, చిన్నారుల ఏకపాత్రాభినయాలు, జానపద నృత్యాలతోచే సిన సందళ్లు.. చిత్రలేఖనంతో ఆకట్టుకునేలా గీసిన చిత్రాలు.. సందేశాత్మక నాటికలతో ప్రేక్షకుల మెప్పు పొందుతూ సాగిన చిన్నారుల రాష్ట్రస్థాయి నాటికలు, సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అబ్బురపరిచాయి. ది కాకినాడ చిల్డ్రన్స్ థియేటర్, దంటు సూర్యారావు స్మారక నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం దంటు కళాక్షేత్రం ప్రాంగణంలో రాష్ట్రస్థాయి చిన్నారుల నాటికలు, సాంస్కృతిక ప్రదర్శన పోటీలు నిర్వహించారు. పోటీలను ది యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు దంటు భాస్కరరావు, కార్యదర్శి పీవీ రావు, కార్యక్రమాల నిర్వాహకులు నాదెళ్ల ప్రభుదాసు, ఎంవీ రమణ తదితరులు జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం దంటు భాస్కరరావు, పీవీ రావులు చిన్నారులనుద్దేశించి మాట్లాడుతూ చిన్నారులను రంగస్థల కళవైపు ఆకర్షితుల్ని చేయడం ద్వారా కళారంగానికి పూర్వ వైభవం తెచ్చేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ఎందరో నటీనటులు, సాంకేతిక నిపుణులను చిత్రసీమకు అందజేసిన ది యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం పోటీలు, నాటికల ప్రదర్శనలు నిర్వహించారు. ఉదయం 8.30గంటల నుంచి ప్రారంభమైన నాటికల పోటీలు రాత్రి వరకు కొనసాగాయి. ఈ సందర్భంగా ది బ్లూక్రస్ట్ పాఠశాల కాకినాడ వారి తెనాలి రామకృష్ణ నాటిక, ఇంద్రపాలెం ఉషోదయ మెరిట్ స్కూల్ వారి అనుసరణ నాటిక, తిమ్మాపురం శారదా విద్యాలయం వారి సోషల్ మీడియా నాటిక, అడ్డంగడి ఎంపీయూపీ పాఠశాల వారి భిన్నత్వంలో ఏకత్వం నాటిక, ఉప్పాడ కొత్తపల్లి వీవీఎస్ హైస్కూల్ వారి ఆడపిల్లలను పుట్టనిద్దాం నాటిక తామరాడ జడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్ వారి మాతృదేవోభవ నాటిక, పిఠాపురం శ్రీదర్శ హైస్కూల్ వారి ఏరువాక నాటిక, కోటనందూరు జెడ్పీ ఉన్నత పాఠశాల వారి నేరం ఎవరిది నాటికలు ప్రదర్శించారు. కార్యక్రమంలో అతిథులుగా డీవీ శివకుమార్(బెహెరెన్), పట్నాల రాము, కేవీఎస్ సీతారామ్, ముంజులూరి విశ్వేశ్వరరావు, వాసు, మార్ని జానకిరామ్‌చౌదరి, గౌరీనాయుడు, సురభిశారద తదితరులు పాల్గొన్నారు. చిన్నారులను కళలు, రంగస్థల ప్రదర్శనల వైపు ప్రోత్సహించేందుకు నాటికల ప్రదర్శనలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. నాటికల ప్రదర్శనలు చూసేందుకు వచ్చిన చిన్నారులతో దంటు కళాక్షేత్రం సందడిగా మారింది.

ఉత్సాహభరితంగా క్రీడాపోటీలు



- ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ ఆదివారం విజేతల వివరాలు

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రాష్ట్రాల మహిళలు, పురుషుల జట్లు మొత్తం ఏడు మ్యాచ్‌లు జరిగాయి. డీఎస్‌డీవో శ్రీనివాస్‌కుమార్, హాకీ కోచ్ రవిరాజు పాల్గొన్నారు.

హోరాహోరీగా పోటీలు

హిమాచల్‌ప్రదేశ్, కేరళ సెక్రటేరియట్ పురుషుల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో హిమాచల్‌ప్రదేశ్ సెక్రటేరియట్ జట్టు 4-1 తేడాతో విజయం సాధించింది. తెలంగాణ, మహ రాష్ట్ర సెక్రిటేయట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మహారాష్ట్ర సెక్రటేరియట్ 10-2 తేడాతో విజయం సాధించింది. ఒడిస్సా సెక్రటేరియట్, ఉత్తరాఖండ్ సెక్రటేరియట్ జట్టుల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిస్సా 5-1 తేడాతో విజయం సాధించింది. ఆర్ఎస్బీ చెన్నై, ఆర్ఎస్బీ చండీఘర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్బీ చెన్నై 4-0 తేడాతో విజయం సాధించింది. సెంట్రల్ సెక్రటేరియట్, ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో సెంట్రల్ సెక్రటేరియట్ 3-0 తేడాతో గెలిచింది. చత్తీస్‌ఘడ్, రాజస్థాన్ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో చత్తీస్‌ఘడ్ 7-1 తేడాతో విజయం సాధించింది. మధ్యప్రదేశ్, కేరళ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కేరళ సెక్రటేరియట్ 5-0 తేడాతో విజయం సాధించింది.



గెలిచిన కేరళ టీం



హోరా హోరీగా తలపడుతున్న క్రీడాకారులు



గెలిచిన కేరళ టీం ఆనందంతో డ్యాన్స్

దివాన్‌చెరువు ఫ్లైఓవర్‌కు లైన్‌క్లియర్

- 2.55 కిలోమీటర్ల దూరం
- రూ.327 కోట్ల అంచనా వ్యయం

రాజమహేంద్రవరంఅర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులు 16(హౌరా-చెన్నయ్)- 216ఏ (గుండుగొలను-కొవ్వూరు-గామన్ ఇండియా వంతెన)ల ను కలుపుతూ దివాన్‌చెరువు సెంటర్లో ఫ్లైఓవర్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. గామన్ వంతెన జంక్షన్-దివాన్‌చెరువు జంక్షన్-ఫ్రూట్ మార్కెట్ సెంటర్‌ను కలుపుతూ ఈ ఫ్లైఓవర్‌ను నిర్మించనున్నారు. మొత్తం రూ.2.55 కిలోమీటర్ల దూరం, రూ.327 కోట్ల అంచనా వ్యయంతో చేపడతారు. ఈమేరకు కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అనుమతులు మంజూరు చేశారు. రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి చొరవతో కేంద్ర ప్రభుత్వం ఈ ఫ్లైఓవర్‌కు గ్రీన్‌సిగ్నల్ లభించింది. దివాన్‌చెరువు వద్ద ఫ్లైఓవర్ ఆవశ్యకతను తెలియజేస్తూ గత ఏడాది జూలైలోనే ఎంపీ పురందేశ్వరి కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి లేఖ రాశారు. గామన్ వంతెనపై ట్రాఫిక్ విపరీతంగా పెరగడంవల్ల దివాన్‌చెరువు సెంటర్‌లో ప్రతిరోజూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఎంతోమంది విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని పేర్కొంటూ తక్షణమే ఫ్లై ఓవర్ మంజూరు చేయాలని ఆ లేఖలో కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర ప్రభుత్వం దివాన్‌చెరువు సెంటర్లో ఫ్లైఓవర్‌కు అనుమతులు మంజూరు చేసింది. ఈ ఏడాది మార్చిలో దీనికి సంబంధించిన పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు.

వికసిత భారత్ టార్గెట్

- కేంద్ర బడ్జెట్‌పై మేధావుల సదస్సులో ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : వికసిత భారత్ లక్ష్యంగా కేంద్ర బడ్జెట్ రూపొందించారని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాలులో బడ్జెట్‌పై ఆదివారం నిర్వహించిన మేధావుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలు, యువత, రైతులు, పెట్టుబడులు ప్రధాన అంశాలుగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ బడ్జెట్ తయారు చేశారన్నారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యంగా ప్రధాని మోదీ పనిచేస్తున్నారన్నారు. దీనికనుగుణంగా రూ.50 లక్షల 50 వేల కోట్లకుపైగా కేంద్రబడ్జెట్ ఉందన్నారు. డాక్టర్ అంబేడ్కర్‌ను గౌరవించడమే కాకుండా ఆయన ఆలోచనలకు అనుగుణంగా బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. బడ్జెట్‌లో యువతకు కేటాయింపులు పెంచారని, ఇప్పటికీ దేశంలో 55శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నందున రైతుల అభ్యున్నతి కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు, సాయి హాస్పటల్స్ అధినేత డాక్టర్ విజయకుమార్, క్రెడాయ్ ప్రతినిధి బుడ్డిగ శ్రీనివాస్, ఛాంబర్ మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ జవ్వార్, బీజేపీ నాయకులు కోడూరి లక్ష్మీనారాయణ, కంటిపూడి సర్వారాయుడు, బొమ్ముల దత్తు, క్షత్రియ బాలసుబ్రహ్మణ్యసింగ్, నీరుకొండ వీరన్నచౌదరి, కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి, పాల్గొన్న వివిధ వర్గాల ప్రముఖులు, బీజేపీ నాయకులు

డీజే సౌండ్స్ ఆపడంతో పోలీసులపై దాడి

- కొమరిపాలెంలో ముగ్గురి అరెస్టు, రిమాండ్

బిక్కవోలు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరిజిల్లా బిక్కవోలు మండలం కొమరిపాలెంలో గస్తీ తిరుగుతున్న ఇద్దరు పోలీసులపై ముగ్గురు వ్యక్తులు దాడిచేసిన సంఘటన శనివారం అర్ధరాత్రి జరిగింది. ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ వివరాల ప్రకారం.. తమ పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన హోంగార్డు ప్రకాష్, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ జీపులో పందలపాక, ఊలపల్లి మీదుగా కొమరిపాలెం గస్తీ తిరుగుతుండగా కొమరిపాలెంలో అర్ధరాత్రి 12 గంటల సమయంలో హరిజనపేటలో డీజే సౌండ్స్ వినబడడంతో అక్కడకు వెళ్లి సౌండ్స్ ఆపివేయించారు. దీంతో అక్కడ మద్యం తాగుతున్న నూతిక అజయ్, లంక మధు, రాయుడు ప్రదీప్ మాపేటలోకి వచ్చి సౌండ్స్ ఆపుతారా అంటూ హోంగార్డు ప్రకాష్ చేతిలోని లాఠీ తీసుకుని అతన్ని కొట్టి కింద పడవేశారు. హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ వెళ్లగా అత న్ని కూడా కొట్టి లాఠీ విరగ్గొట్టి, చొక్కా చింపేసి సెల్‌ఫోన్ లాక్కుని అతడిని పక్కనున్న డ్రైనేజీలో పడవేశారు. ఈ ఘటనలో గాయాలపాలైన పోలీసులిద్దరూ అనపర్తి ఏరి యా ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకుని ఫిర్యాదు చేయగా ముగ్గురిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు. అనపర్తి కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించారని ఎస్ఐ వివరించారు.

సైబర్‌మోసం

- రూ.10 లక్షలు హుష్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని టి.నగర్‌కి చెందిన ఆదిత్య శ్రీకాంత్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. గత డిసెంబరు నెలలో టెలిగ్రాం ద్వారా ఓ ఫైనాన్స్ కంపెనీ లింక్ వచ్చింది. తమ వద్ద పెట్టుబడి పెడితే రెట్టింపు సొమ్ము వస్తుందని నమ్మించారు. దీంతో దఫదఫాలుగా శ్రీకాంత్ పెట్టుబడి పెట్టడం మొదలు పెట్టాడు. రూ.10లక్షలు పెట్టుబడి పెట్టిన తర్వాత ఆ కంపెనీ యాప్ పని చేయడంలేదని, తాను మోసపోయానని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ మంగాదేవి తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

- రూ.1,26,290 స్వాధీనం

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం చీడిగ పేకాట స్థావరంపై దాడి చేసి 10 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.1,26,290 స్వాధీనం చేసుకున్నట్టు ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపారు. 10మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



కాకినాడలో గ్రూప్- 2 మెయిన్స్ పరీక్షలు రాస్తున్న అభ్యర్థులు

ప్రశాంతంగా గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు

- కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో 12 కేంద్రాల్లో గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు తెలిపారు. జిల్లా యంత్రాంగం పరీక్షల కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగాయి. 12 కేంద్రాల్లో ఉదయం 9379 మంది అభ్యర్థులకుగాను 8167 మంది అభ్యర్థులు హాజరుకాగా, 1212మంది పరీక్షకు హాజరు కాలేదు. 86.06 శాతం నమోదైంది. మధ్యాహ్నం 9379మంది అభ్యర్థులకుగాను 8163మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకాగా 1216 మంది హాజరు కాలేదు. 85.94శాతం నమోదైంది. ఏపీపీఎస్సీ మెంబర్ సోనీవుడ్, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు జేఎన్‌టీయూ కాకినాడ కేంద్రాలను తనిఖీచేసి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.



పరీక్షా కేంద్రానికి పరుగెడుతున్న అభ్యర్థి



పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న దృశ్యం, పరీక్షా కేంద్రం వద్ద కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్

సహజ వనరులపై ఆంధ్రులకే హక్కు



సదస్సులో మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు మహాదేవ్

- కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు మహాదేవ్
- మన గ్యాస్, మన చమురు-ఆంధ్రుల హక్కు అంశంపై సదస్సు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కృష్ణ, గోదావరి బేసిన్‌లో లభ్య మవుతున్న గ్యాస్, చమురుతదితర సహజ వనరులపై ఆంధ్రులకే హక్కు ఉంటుందని, రూ.లక్షల కోట్ల విలువైన సహజ సంపదను కార్పొరేట్ సంస్థలు దోచుకుపోతున్నాయని కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు వైవీఎస్ మహాదేవ్ మండిపడ్డారు. కాకినాడ గాంధీభవన్‌లో ఆదివారం మన గ్యాస్, మన చమురు ఆంధ్రుల హక్కు నినాదంతో సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మహాదేవ్ మాట్లాడుతూ కేజీ బేసిన్‌లో బొంబాయ్ కంటే చమురు నిల్వలు అత్యధికంగా ఉన్నాయన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు క్షేత్రం ఆంధ్రప్రదేశ్‌లో ఉందన్నారు. ఇక్కడి నుంచి రూ.60లక్షల కోట్ల విలువైన చమురు నిల్వలను కార్పొరేట్ సంస్థలు తరలించుకుపోతున్నా యన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 38, 39బి ప్రకారం సహజ వనరులు ఏ ప్రాంతలో వెలికితీసినా ఆ ప్రాంత అభివృద్ధికి 30శాతం ఖర్చుచేయాలని ఉన్నప్పటికీ ఆచరణలో శూన్యంగా ఉందన్నారు. ఇదే విధంగా కొనసాగితే కోనసీమ ప్రాంతంలో దాదాపు 40 వేల ఎకరాల భూముల్లో పంటలు పండకుండా ఉప్పు భూములుగా మారిపోతాయన్నారు. సీపీఐ నేత ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ సహజ వనరుల పరిరక్షణకోసం ఈ సదస్సు ఏర్పాటు చేశామని, రాబోయే రోజుల్లో ఇది అతి పెద్దఉప్పెనగా మారుతుందన్నారు. నేడు కాకినాడలో కూడా పెద్ద భవనం కడితే అది భూమిలో కూరుకుపోతుందనే భయంతో ప్రజలు ఉన్నారన్నారు. సభాధ్యక్షుడు ప్రొఫెసర్ ఆలపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రాంత వాసులకు ఉద్యోగ, ఉపాధి కల్పించకుండా రాష్ట్ర సహజ వనరులను తరలించుకుపోతున్నారన్నారు. సామాజికవేత్త అక్కినేని వనజ, న్యాయవాది జవహర్ ఆలీ మాట్లాడుతూ యువత అవగాహన కలిగి సహజ సంపదను కాపాడుకునే విధంగా ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఉపాధ్యక్షుడు డేగ ప్రభాకర్, రాష్ట్ర బీకేఎంయు కార్యదర్శి తాటిపాక మధు, నాయకులు కామిరెడ్డి బోడకొండ, వాసిరెడ్డి ఏసుదాసు, తోకల ప్రసాద్, పప్పు ఆదినారాయణ, కోణాల భీమారావు, పెదిరెడ్ల సత్యనారాయణ, టి.అన్నవరం కె.కిషోర్, మేధావులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు కథా సాహిత్యంలో వేట కథలు ప్రత్యేకం

- వేటకథల సదస్సులో వక్తలు

యానాం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలుగు కథా సాహిత్యంలో వేట కథలు ఎంతో ప్రత్యేకమైనవని కొంత మంది కథకులు అద్భుతమైన వేటకథలు రాశారని పలువురు వక్తలు అన్నారు. ప్రాచీన సాహిత్యం నుంచి ఆధునిక సాహిత్యం వరకు వేటకథలు ఒక ప్రత్యేకతను సంతరించుకున్నాయని వక్తలు వివరించారు. ఆదివారం ఉదయం స్థానిక సర్వశిక్షఅభియాన్ సమావేశపు హాలులో సాహిత్య అకాడామీ- స్ఫూర్తి సాహితీ సమాఖ్య యానాం సంయుక్త నిర్వహణలో వేటకథలు-సదస్సు అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సమావేశానికి సాహిత్య అకాడమీ సభ్యులు చింతకింది శ్రీనివాసరావు ప్రారంభసభకు స్వాగతోపన్యాశం పలుకులు వేటకథలుపై ఏ భాషలోను ప్రత్యేక సదస్సు జరగలేదని తెలిపారు. వేటకథలుపై అకాడమీ, స్ఫూర్తి సాహితీ సంస్థ ద్వారా యా నాంలో నిర్వహించిన సదస్సుకు ఏంతో విశిష్టత ఉందన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్ఎ మునిస్వామి మాట్లాడుతూ ఇంతమంది సాహితీవేత్తలతో యానాం సాహిత్యసదస్సు నిర్వహించడం సంతోషంగా ఉందని తెలుగుభాష ఎంతో సుందరమైనదన్నారు. అనంతరం సాహిత్య అకాడమీ తెలుగుసలహా సంఘం కన్వీనర్ రచయిత్రి సి.మృణాళిని అధ్యక్షోపన్యాసం చేశారు. మనిషికి జంతువులకు అనుబంధం. అలాగే మనిషికి మనిషికి మధ్య సంబంధాలను వేటకథలు విశ్లేశిస్తాయన్నారు. గౌరవ అతిథి స్ఫూర్తి సాహితీ సమాఖ్య అధ్యక్షుడు దాట్ల దేవదానంరాజు మాట్లాడుతూ ప్రత్యేకంగా వేటకథలు సదస్సు నిర్వహించాలని నిర్ణయించడం అభినందనీయమన్నారు. వేట కథలకు ఇంతమంది సాహితీవేత్తలతో సదస్సు జరగడం ఇదే ప్రథమంగా భావిస్తున్నట్లు తెలిపారు. ప్రారంభసభకు కథకుడు రత్నాకర్ పెనుమాక వందన సమర్పణ చేశారు. అనంతరం నిర్వహించిన మొదటి సదస్సుకు యానాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ప్రముఖ సాహితీవేత్త వాసిరెడ్డి నవీన్ అల్లం శేషగిరిరావు కథలపై మాట్లాడారు. వేటకథలు అద్భుతంగా రాసిన కథకుల్లో అల్లం శేషగిరిరావు ప్రముఖంగా నిలుస్తారని అన్నారు. ఆయన రాసిన కథల్లో ఒకటైన చీకటి కథ గురించి ప్రత్యేకంగా వివరించారు. ఈ కథలో ఎన్నో లేర్లు ఉంటాయని ఒక్కొక్క లేరు జీవితంలో చీకటి గురించి, సమాజంలో చీకటి గురించి గొప్పగా రాసిన కథ అన్నారు. జేపీ వైద్య కథలపై ప్రముఖ కవి అవధానుల మణిబాబు మాట్లాడారు. ఆ కథల్లో ప్రస్తావించిన అంశాలను వివరించారు. రెండో సదస్సుకు కాళ్లకూరి శైలజ అధ్యక్షత వహించి మాట్లాడారు. జె.నీరజ పతంజలి కథలు గురించి మాట్లాడారు. జంతువులను వేటాడటం కాదని జంతువులా మారుతున్న మనిషిని వేటాడాల్సిన పరిస్థితులపై పతంజలి ఆందోళన వక్తంచేస్తారన్నారు. ఆయన కథలు ఎంతో ఆలోచనాత్మకంగా లోతైన అంశాలతో ఉంటాయన్నారు. ఎస్వీ రంగారావు, ఇతర రచయితల వేట కథలపై ప్రముఖకవి, కథకుడు అద్దేపల్లి ప్రభు మాట్లాడారు. వేటలో ఎన్నో రకాలు ఉన్నా యన్నారు. రాజుల వేట అలాగే గిరిజనులు చేసే వేట, సముద్రంలో చేసే వేట ప్రపంచీకరణ నేపథ్యంలో అంశాలను వివరించారు. పూసపాటి కృష్ణంరాజు కథలపై మందలపర్తి కిశోర్ మాట్లాడారు. కార్యక్రమంలో కళై మామణి పొనుగుమట్ల విష్ణుమూర్తి, మాకినీడి సూర్య భాస్కర్, మోకా రత్నరాజు, చింతాకొండలరావు, పోనుగుమట్ల అశోక్‌కుమార్ పాల్గొన్నారు. సాహిత్య అకాడమీ ఇన్‌చార్జి టీఎస్ చంద్రశేఖరన్ సదస్సునుపర్యవేక్షించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాహితీ సమాఖ్య అధ్యక్షుడు దాట్ల దేవదానం రాజు

సత్యదేవుడి సన్నిధికి పోటెత్తిన భక్తులు

- రూ.50 లక్షల ఆదాయం



దర్శనంకోసం బారులు తీరిన భక్తులు

అన్నవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి ఆదివారం భక్తులతో పోటెత్తింది. ఆదివారం సెలవుదినం కావడంతోపాటుగా దశమి, ఏకాదశి పర్వదినం, మాఘమాసంలో చివరి వివాహ ముహూర్తం కావడంతో వివాహాలు చేసుకున్న జంటలతో ఈ రద్దీ నెలకొంది. ఉచిత దర్శనానికి మూడుగంటలు, ప్రత్యేక దర్శనానికి రెండు గంటలు సమయం భక్తులు వేచి ఉన్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో రూ.200 అంత్రాలయ దర్శన టిక్కెట్లను నిలుపుదలచేసి శీఘ్రదర్శనానికి మాత్రమే అనుమతించారు. ఆలయ ఈవో సుబ్బారావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 4 వేల వ్రతాలు జరగ్గా వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.50లక్షల ఆదాయం సమకూరింది. సత్యదేవ నిత్యాన్నదాన పథకం ద్వారా 4500 మందికి అన్నప్రసాద వితరణ గావించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

యానాం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): యానాంలో ప్రజాపనుల శాఖ ఆధ్వర్యంలో స్థానిక గోపాల్‌నగర్ రోడ్డులో జరుగుతున్న పైప్‌లైన్ పనులు, కనకాలపేట పంప్‌హౌస్ వద్ద నీటి పంపింగ్ ప్రక్రియను పరిపాలనాధికారి మునిస్వామి అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రజా పనుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వీరభద్రుని సంబరం

మామిడికుదురు, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లిలో వీరభద్రుని సంబరాన్ని భక్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తులా ఆదినారాయణ-వెంకటలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో సంబరం జరిగింది. కళాకారులు శరభశరభఅంటూ నృత్యం చేస్తూ సన్నాయి వాయిద్యాల నడుమ వైనతేయ నది వరకు ఊరేగింపు నిర్వహించారు.

పేదల ఇళ్ల స్థలాల సాధనకు పోరాటం సాగించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకరరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి దేగా ప్రభాకరరావు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్ల స్థలాలు, టిడ్కో గృహాల సాధనకు 40లక్షల మంది లబ్ధిదారుల తరపున పోరాటం సాగించేందుకు సీపీఐ శ్రేణులంతా సమాయత్తం కావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దేగా ప్రభాకరరావు పిలుపునిచ్చారు. ముమ్మిడివరంలోని సీపీఐ కార్యాలయంలో శీలం వెంకటేష్ అధ్యక్షతన జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. మార్చి 3 నుంచి 23 వరకు బడ్జెట్‌లో ప్రజా వ్యతిరేక విధానాలపై వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. మరో ముఖ్య అతిథి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు మాట్లాడుతూ మోదీ హయాంలో కార్మిక వర్గానికి, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరో ముఖ్య అతిథి, జిల్లా అధ్యక్షుడు కె.సత్తిబాబు మాట్లాడుతూ పార్టీ నిర్మాణంపై కార్యకర్తలంతా దృష్టి సారించాలన్నారు. అనంతరం సీపీఐ శతవార్షికోత్సవం సందర్భంగా, దివంగత నేత, జిల్లా వ్యవసాయ సంఘ మాజీ అధ్యక్షుడు నేలపూడి సూరన్న 30వ వర్ధంతిని పురస్కరించుకుని మార్చి 1వ తేదీన అంబాజీపేటలో నిర్వహించే బహిరంగ సభకు రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రానున్నారని, ఆ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు భారీఎత్తున తరలిరావాలన్నారు. ఈసందర్భంగా బహిరంగ సభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నిమ్మకాయల శ్రీనివాసరావు, గూడాల వెంకటరమణ, వనచర్ల విజయ్‌కుమార్, కె.రామకృష్ణ, నేలపూడి నాగభూషణం, పితాని ఆనందరావు, చెల్లుబోయిన తాతారావు, సానబోయిన మనోహర్, డి.వీరంశెట్టి, ఎస్.సుందరయ్య, పెద్దిరెడ్డి రాము పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి తీర్థం







సత్తెమ్మతల్లి అమ్మవారు, గరగ నృత్యాలు, పుర్రెలతో శివుని వేషధారణ

ముమ్మిడివరం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలో సత్తెమ్మతల్లి తీర్థం ఆదివారం వైభవంగా సాగింది. బాజాభజంత్రీలు, బ్యాండు మేళాలు, గరగ నృత్యాలు, భారీ బాణసంచా కాల్పులు, బుట్టబొమ్మల వేషధారణల మధ్య అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. ఈనెల19నుంచి అమ్మవారి జాతరమహోత్సవాలు ప్రారంభమయ్యాయి. నాలుగు రోజులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సాంస్కృతికకార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆదివారం అమ్మవారి తీర్థం భారీఎత్తునజరిగింది. భారీఅన్నసమారాధన అనంతరం అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. వంద మందితో గరగనృత్యాలు, మూడు గారడీ మేళాలు, 200మంది బుట్టబొమ్మల వేషధారణలు, నాలుగు ఆర్కెస్ట్రాలు, 50 మందితో కోయడాన్సులు, 50మంది కేరళ వాయిద్యాలతో సుమారు 2వేల మంది కళాకారులతో అమ్మవారు ఊరేగింపును నిర్వహించారు. వేలాదిమంది భక్తులు తరలిరావడంతో మహిపాలచెరువు, కాట్రేనికోన రోడ్డు జనసందోహంగా మారింది. ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి.ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పుట్టింటి ఆడపడుచులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మహిపాలచెరువు-కాట్రేనికోనరోడ్డులో ట్రాఫిక్‌ను మళ్లించారు. సీఐ ఎం.మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ డి.జ్వాలాసాగర్ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

విశ్వనాథం పేరిట బాడీబిల్డింగ్ పోటీలు



కాశీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బాడీబిల్డింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): క్రీడా రంగానికి ఎనలేని సేవలు అందించి అమరులైన విశ్రాంత వ్యాయామోపాధ్యాయుడు రంకిరెడ్డి విశ్వనాథం పేరిట బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్ నిర్వహించనున్నట్టు కోనసీమ బాడీబిల్డింగ్ అసోసియేషన్ ప్రకటించింది. తొలుత కాశీవిశ్వనాథం చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అమలాపురం హెల్త్-ఫిట్‌నెస్ జిమ్‌లో ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. విశ్వనాథం ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాశీ మృతి క్రీడా రంగానికి తీరని లోటని అసోసియేషన్ ప్రతినిధి వంటెద్దు వెంకన్నాయుడు పేర్కొన్నారు. సంతాప సభలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు, క్రీడా భారతి కార్యదర్శి పప్పుల శ్రీరామచంద్రమూర్తి, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిదులు మట్టపర్తి సముద్రం, నార్ని శ్రీను, చిక్కం రాజబాబు, గంగుమళ్ల దొరబాబు, జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో గడియార స్తంభం సెంటర్లో కాశీ మృతికి సంతాప సభ నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో కాశీ చిత్రపటానికి సభ్యులు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యదర్శి బూరగాయల శివరామకృష్ణ, తేతల సత్యనారాయణరెడ్డి, యర్రమిల్లి సత్యనారాయణమూర్తి,నూకల సత్యనారాయణ, వలవల వెంకటరెడ్డినాయుడు, ఉప్పుగంటి భాస్కరరావు, పుత్సా కృష్ణకామేశ్వర్ పాల్గొన్నారు.

తొందరపాటు నిర్ణయాలతో కుటుంబాలు నష్టపోతాయి

-చికిత్స పొందుతున్న ఉపాధ్యాయురాలికి ఎమ్మెల్యే గిడ్డి పరామర్శ

పి.గన్నవరం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో లోటు పాట్లు ఉంటాయని మీ సమస్యలను ఉన్నతాధికారులకు లేదా మా దృష్టికి తీసుకురావాలని తొందరపాటు నిర్ణయాలతో మీ కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ముంగండ హైస్కూల్ బయోలజికల్ ఉపాధ్యాయురాలు లావణ్యకు సూచించారు. అమలాపురంలో చికిత్స పొందుతున్న లావణ్యను ఎమ్మెల్యే పరామర్శించి అనంతరం మాట్లాడారు. హెచ్‌ఎం జి.కనకదుర్గ వేధింపులు తాళలేకపోయ్యానని ఆమె ఎమ్మెల్యే వద్ద వాపోయింది. అలాగే టీడీపీ నియోజకవర్గ కోఆర్డి నేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు ఉపాధ్యాయురాలు లావణ్యను పరామర్శించి ధైర్యం చెప్పారు. వారి వెంట నియోజకవర్గానికి చెందిన పలువురు కూటమికి చెందిన ప్రజాప్రతినిదులు ఉన్నారు.

మందులషాపులో చోరీ

పి.గన్నవరం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మందులషాపులో రూ.లక్ష చోరీకి గురైంది. పి.గన్నవరం-అమలాపురం ప్రధాన రహదారి శివాలయం వీధికి ఎదురుగా ఉన్న గణేష్‌మెడికల్ షాపుకి ఆదివారం మధ్యాహ్నం ఇద్దరు యువకులు మోటార్‌సైకిల్‌పై వచ్చారు. ఒక యువకుడు బైక్‌పై నుంచి దిగి షాపులో ఉన్న తోలేటి రాంబాబును రూ.పది నోట్లు రూ.1200 వరకు ఉన్నాయని, చిల్లర కావాలని అడిగాడు. దీంతో రాంబాబు రూ.పది నోట్లు తీసుకుని కౌంటర్ వద్ద ఉన్న క్యాష్ బ్యాగ్‌లో నగదు (పెద్దనోట్లు) ఇచ్చారు. ఆ సమయంలో వారు ప్యాంపర్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు కావాలని రాంబాబును అడిగారు. వాటిని తీసుకురావడానికి సీటు నుంచి లేచి వెనక్కి వెళ్లారు. దీంతో ఆ యువకుడు కౌంటర్‌లో ఉన్న క్యాష్‌బ్యాగ్‌ను తీసుకుని అప్పటికే మోటార్‌సైకిల్‌పై సిద్ధంగా మరో యువకుడితో కలిసి అక్కడ నుంచి పరారయ్యాడు. ఎస్ఐ బి.శివకృష్ణ త్రీరోడ్ సెంటర్‌లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. ఆ యువకులు త్రీరోడ్ సెంటర్ నుంచి గంటిరోడ్డు వైపు వెళ్లినట్టు గుర్తించారు. బ్యాగ్‌లో రూ.లక్ష నగదు, ఏటీఎం కార్డులు, బ్యాంక్ పుస్తకాలు, బిల్లులు ఉన్నాయని రాంబాబు తెలిపాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి రాజశేఖర్‌ను గెలిపిద్దాం

పలుచోట్ల ఎన్నికల ప్రచారం



ఉప్పలగుప్తం: మునిపల్లిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు గ్రాడ్యుయేట్ ఓటర్లను కోరారు. ఆదివారం ఆయన ఎన్.కొత్తపల్లి, మునిపల్లి తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు కర్రోతు బంగార్రాజు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు అరిగెల నానాజీ, ఏఎంసీ మాజీ చైర్మన్ నిమ్మకాయల సూర్యనారాయణమూర్తి, కూటమి నాయకులు పాల్గొన్నారు. అంతకు ముందు భీమనపల్లిలో జరిగిన ప్రచారంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం, ఎంపీటీసీ దేశంశెట్టి నాగరత్నకుమారి, టీడీపీ నాయకులు మంచెం బుజ్జి, ఉప సర్పంచ్ కోలపల్లి గోపి, ఆకేటి పెద్ద, మంచెం బాబి, యాళ్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజశేఖరానికి మద్దతుగా ప్రచారం

మలికిపురం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కూటమి నాయకులు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, జంపన సత్యనారాయణరాజు, కాకి లక్ష్మణ్, పిండి సత్యనారాయణ, బొక్కా గోవిందు, జక్కంపూడి శ్రీనివాస్, గుబ్బల రవికిరణ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్యతా ఓటేసి గెలిపించాలి

పి.గన్నవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి పిలుపునిచ్చారు. లంకలగన్నవరంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో వారు మాట్లాడారు. కూటమి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓట్లు వేయాలని కోరుతూ కరపత్రాలు, నమూనా బ్యాలెట్ పత్రాలు ఓటర్లకు అందించారు. అదేవిధంగా కె.ముంజరవరంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు మట్టపర్తి రామకృష్ణ స్థానిక నాయకుడు కుంపట్ల నాయుడుతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీటీసీ అవనిగడ్డ సత్తిబాబు, మాజీ ఎంపీటీసీలు గూటం రత్నంరాజు, యర్రంశెట్టి నాగేశ్వరరావు, పైడి బుజ్జి, గనిశెట్టి ఈశ్వర్, గనిశెట్టి శ్రీనివాస్, అంబటి దుర్గారావు, వేమన రామకృష్ణ, పిల్లి నాగపండు, రాపాక శ్రీను, శేరు పోతురాజు, లంకే భీమరాజు, పిల్లి స్వామి, వేమన గంగాధర్, గుత్తుల శివ, కె.శ్రీను పాల్గొన్నారు.

కూటమి నాయకుల ప్రచారం

అల్లవరం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు పిలుపునిచ్చారు. ఆదివారం వారు కూటమి నాయకులతో కలిసి బెండమూర్లంకలో ప్రచారం నిర్వహించారు. జనసేన నాయకులు గుర్రం కృష్ణ, గునిశెట్టి చినబాబు, సర్పంచ్ నడింపల్లి సుబ్రహ్మణ్యంరాజు, నీటి సంఘం అధ్యక్షుడు సాధనాల రాంబాబు, బండి గుప్తాపు సత్తిబాబు, ఆకుల నాగశ్రీను, గోసంగి స్టాలిన్‌బాబు, కూటమి నాయకులుపాల్గొన్నారు.

కేశనకుర్రులో ప్రచారం

ఐ.పోలవరం, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి):క్లస్టర్ ఇన్‌చార్జి సాగిరాజు సూరిబాబురాజు ఆధ్వర్యంలో ఆదివారం నందులవారిమెరక, అంబేద్కర్‌నగర్‌లో టీడీపీ, జనసేన నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేశనకుర్రులో చిక్కం రాంబాబు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. మద్దిరెడ్డి కుమార్, దంగుడుబియ్యం మోహన్, నీటి సంఘం అధ్యక్షుడు రాయపురెడ్డి స్వామినాయుడు, జనసేన నాయకులు మల్లిపూడి రాజా, దంగుడుబియ్యం సతీష్, గట్టుముక్కల కొండరాజు, బొంతు ప్రసాద్, కాశి చిరంజీవి, నంబూరి సీతారామరాజు, నల్లా రాజు, ఇళ్ళ చంద్రశేఖర్, పెమ్మిరెడ్డి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తొత్తరమూడిలో ప్రచారం

అయినవిల్లి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటువేసి గెలిపించాలని కూటమి నాయకులు పట్టభద్రుల ఓటర్లను కోరారు. ఆదివారం తొత్తరమూడి గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్బారావు, కడలి పెద్ద, హెచ్ఆర్డీ సభ్యులు నేదునూరి వీర్రాజు, వారా లక్ష్మీనరసింహరామ్, బిక్కిన బాబు, అంబటి రాజు, కడలి సుబ్రహ్మణ్యం, కముజు రాంప్రసాద్, తోటకూర సత్యారావు, కోడూరి ఏడుకొండలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ నాయకులు ఓటర్లను అభ్యర్థించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ మల్లాయిపాలెం 12వ వార్డు పరిధిలో ఆదివారం దివంగత 12వ వార్డు కౌన్సిలర్ భీమవరపు విజయ్ సోదరులు దుర్గబాబు, శ్రీనివాస్, అతని తల్లి పుష్పరత్నఅనసూయల ఆధ్వర్యంలో ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో నరిపెల్ల శ్రీనురాజు, మెండి కమల, యల్లమిల్లి వెంకటేశ్వరరావు, వెంట్రు సుధీర్, గెద్దం శ్రీనివాస్, గోడి వెంకట్రావు, గొల్లపల్లి గోపి, దొంగ గంగాధర్, కడలి వెంకట సత్యనారాయణ, సంసాని నాగరాజు, సంసాని గంగాధర్, సానబోయిన శ్రీహరి, సాపే రూప, కాశి జ్యోతిబాబు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



మామిడికుదురులో తడిచెత్త-పొడిచెత్తను పరిశీలిస్తున్న డీఎల్పీవో బొజ్జిరాజు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రజలంతా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి తడి-పొడి చెత్తలను వేర్వేరుగా పారిశుధ్య కార్మికులకు అందించాలని జిల్లా పంచాయతీ అధికారిణి శాంతలక్ష్మి సూచించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం అనాతవరంలో ఇంటింటీ వెళ్లి పంచాయతీ సిబ్బంది, క్లాప్ మిత్రులు తడి-పొడి చెత్తను సేకరించారు. కార్యక్రమాన్ని జిల్లా పంచాయతీ అధికారిణి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించి తడి-పొడి చెత్తను ఎలా వేరుచేసి అందించాలనే విషయంపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కల్యాణి, పంచాయతీ కార్యదర్శి సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు సహకరించాలి

అయినవిల్లి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు క్రాప పంచాయతీ పరిధిలోని ప్రతీ ఇంటికీ ఆదివారం వెళ్లి చెత్త నుంచి సంపద తయారీ చేసేందుకు గ్రామస్తులంతా సహకరించాలని పంచాయతీ కార్యదర్శి సీహెచ్ అమ్మాజీ విజ్ఞప్తి చేశారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి తడిచెత్త-పొడిచెత్త వేరుసేచే విధానంపై ప్రతీ కుటుంబానికి కార్యదర్శి, సిబ్బంది అవగాహన కల్పించారు.సర్పంచ్ గంజి పేరయ్యనాయుడు, గుంట్రు నారాయణ, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

అంబాజీపేట, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రతి గ్రామంలో తడిచెత్త, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఈవోపీఆర్డీ జి.భీమారావు తెలిపారు. మాచవరం పంచాయతీ పరిధిలోని దొమ్మేటివారిపాలెంలో ఇంటింటికి వెళ్లి పొడిచెత్త, తడిచెత్త వేరుచేసి పారిశుధ్య కార్మికులకు అందించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, పంచాయతీ సిబ్బంది రాంబాబు, మోహన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మాచవరంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారిసుబ్బరావు ఆధ్వర్యంలో దోమల నివారణకు శనివారం రాత్రి ఫాగింగ్ నిర్వహించారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలి

మామిడికుదురు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తడి-పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలని అమలాపురం డీఎల్పీవో బొజ్జిరాజు సూచించారు. మామిడికుదురులో నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని డీఎల్పీవో ఆదివారం పరిశీలించారు. శని, ఆదివారాలు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని, గ్రామాల్లోని ఇళ్ల నుంచి వచ్చే చెత్తను విధిగా సేకరించాలన్నారు. గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు పకడ్బందీగా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎ.శ్రీనివాసరావు, సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, పంచాయతీ కార్యదర్శి పీవీఆర్కే రాజు తదితరులు పాల్గొన్నారు.

2న హిమాలయ యోగి జ్ఞానానందగిరి రాక



అమలాపురం టౌన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): క్రియా యోగ జ్ఞాన తపోవన సేవాశ్రమం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో భాగంగా మార్చి 2న హిమాలయ యోగి స్వామి జ్ఞానానందగిరి మహరాజ్ అమలాపురం రానున్నట్టు సంస్థ ప్రతినిధి కూర్మయ్యగారి భాస్కరరావు తెలిపారు. అమలాపురం శ్రీసత్యసాయి కల్యాణ మండపంలో 2న జరిగే ఉచిత క్రియా యోగా, జ్ఞాన శిక్షణ తరగతిలో ఆయన పాల్గొంటారన్నారు. ఆ రోజు ఉదయం 8నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు శిక్షణ ఇస్తారని చెప్పారు.

డిజైనింగ్ పోటీలో నందన్‌కు ప్రథమ బహుమతి

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కాన్వధాన్ పేరిట పాఠశాల స్థాయి విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఆన్‌లైన్ డిజైనింగ్ పోటీల్లో సమనస ఢిల్లీ పబ్లిక్ స్కూలు విద్యార్థి పి.నందన్ జూనియర్ కేటగిరీలో ప్రథమ బహుమతి సాధించాడు. 5వ తరగతి చదువుతున్న అతడికి స్వర్ణలత శిక్షణ ఇచ్చారు. నందన్‌ను పాఠశాల డైరెక్టర్లు నంద్యాల మనువిహార్, స్నేహప్రియ, ప్రిన్సిపాల్ దేవిదీక్షిత్ అభినందించారు.

బాలికల రక్షణపై సదస్సు

అల్లవరం, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికల సంరక్షణపై అమలాపురం రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. గోడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో మహిళా చట్టాలు, బాలికల చట్టాలపై సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్ఐ జి.హరీష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్వేషాలు రెచ్చగొట్టేవారిపై చర్యలు తీసుకోవాలి

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వేదికగా కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా దళిత సంఘాల జేఏసీ నాయకులు కోరారు. ఈదరపల్లి అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సమావేశం నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను దూషిస్తూ, భారత రాజ్యాంగాన్ని హేళనచేస్తూ దళిత సామాజికవర్గమైన మాల కులాన్ని దూషిస్తూ సామాజిక మాధ్యమాల్లో ఆధిపత్య కుల యువత టిక్‌టాక్ వీడియోలు పెడుతోందన్నారు. వాటి పూర్వాపరాలు పరిశీలించకుండా దళిత యువతపై చేసిన తప్పుడు ఫిర్యాదులతో వారు పోలీసుల వేధింపులకు గురవుతున్నారన్నారు. తక్షణం పోలీసుల వేధింపులు ఆపాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఇసుకపట్ల రఘుబాబు, బొంతు రమణ, రేవు తిరుపతిరావు, నక్కా సంపత్‌కుమార్, శెట్టిబత్తుల తులసీరావు, గెల్ల రాజేంద్ర, గిడ్ల శ్యామ్, పెయ్యల ప్రతాప్, మెండి డేవిడ్ అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తిదారులకు ఆదరణ పథకం

అంబాజీపేట, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): కులవృత్తిదారులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ఆదరణ పథకాన్ని అమలు చేస్తుందని రజక కార్పొరేషన్ డైరెక్టర్ గొల్లపల్లి ధర్మారావు అన్నారు. వక్కలంకలో రజక సంఘం మండల అధ్యక్షుడు నేదునూరి కల్యాణ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమలాపురం తాలుకా రజక సంఘం అధ్యక్షులు పేట ఏడుకొండలు, మాచవరపు కాశీ, అధికారపు బాబ్జి, కమిడి అబ్బు, కొత్తపల్లి శివరామకృష్ణ, నేదునూరి రామకృష్ణ, వెంకటేశ్వరరావుపాల్గొన్నారు.

షెడ్డులోకి చేరిన రథం



అంతర్వేది, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఈనెల4 నుంచి 13వ తేదీ వరకు వైభవంగా జరిగిన లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భీష్మ ఏకాదశి నాడు స్వామి రథంపై వైభవంగా ఊరేగి 16 స్తంభాల మండపం వద్దకు వచ్చారు. రథాన్ని ఆదివారం షెడ్డుకు చేర్చినట్టు ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో వాహనకారులు, భక్తులు పాల్గొన్నారు.

అంతర్వేది ఆలయానికి పోటెత్తిన భక్తులు

అంతర్వేది, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): మాఘమాసం చివరి ఆదివారం కావడంతో అంతర్వేది పుణ్యక్షేత్రానికి భక్తుల తాకిడి పెరిగింది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వేకువజాము నుంచి సముద్ర, నదీ పుణ్యస్నానాలు ఆచరించారు. లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి క్యూలైన్‌లో ప్రధాన గోపురం వరకు వేచి ఉన్నారు. దర్శనం అనంతరం నిత్యాన్నదానంలో ప్రసాదం స్వీకరించారు. మహిళలు వేపచెట్టు వద్ద దీపారాధన చేశారు. భక్తులు, పర్యాటకులు సాయంత్రం బీచ్, లైట్‌హౌస్ పరిసర ప్రాంతాల్లో సందడి చేశారు.

వేధింపులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

మామిడికుదురు, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): ముంగండ హైస్కూలులో బీసీ ఉపాధ్యాయినిపై వేధింపులకు పాల్పడిన హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం, జిల్లా అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ డిమాండ్ చేశారు. వేధింపులు తాళలేక ఉపాధ్యాయిని ఆత్మహత్య యత్నంగాచేయగా ఆమె త్రుటిలో ప్రాణాలతో బయట బడిందన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్కా వీరవెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పల్లంరాజు, పి.వెంకటగోపాలం పాల్గొన్నారు.

నీటిపారుదల పునరుద్ధరణ పనులు ప్రారంభం

రాజోలు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కడలి చానల్‌లో ములికిపల్లి నుంచి చాకలిపాలెం వరకు సుమారు 8 కిలోమీటర్ల వరకు నీటి నియంత్రణ కోసం నీటిపారుదల వ్యవస్థ పునరుద్ధరణ పనులను గోదావరి సెంట్రల్ సెంట్రల్ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల్వలో ఉన్న గుర్రపుడెక్క, చెత్తాచెదారాలను పూర్తిగా తొలగించి శివారు ప్రాంతాల్లోని వరి చేలకు నీరందేలా కృషి చేస్తామన్నారు. తాటిపాక సెక్షన్ ఇరిగేషన్ ఏఈఈ సుందర్‌సింగ్, తాటిపాక నీటి సంఘం అధ్యక్షుడు కడలి కృష్ణమోహన్, కడలి నీటి సంఘం ఉపాధ్యక్షుడు ఆకుమర్తి వెంకటేశ్వరరావు, కడలి అబ్బు, మామిడిశెట్టి నాగరాజు, ముగ్గ పెద్దిరాజు, కుడుపూడి శ్రీనివాస్, కడలి మోహన్ పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్యకు మోక్షం

కాట్రేనికోన, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 గ్రామాల విద్యుత్ వినియోగదారులకు లోఓల్టేజీ సమస్యకు పరిష్కారం దొరికింది. ట్రాన్స్‌కో అధికారుల కృషితో 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఈపనులు ఆదివారం రాత్రి పూర్తయ్యాయి. ట్రాన్స్‌కో ఎస్ఈ రాజబాబు, ఈఈలు కె.రాంబాబు, వై.విజయానంద్, డిప్యూటీ ఈఈ శ్రీనివాసరావు పర్యవేక్షణలో కాట్రేనికోన ఇన్‌చార్జి ఏఈ మానేపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పనులు పూర్తి చేశారు.

ఘనంగా పోలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



మామిడికుదురు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): లూటుకుర్రులో పునఃప్రతిష్ఠించిన పోలమ్మ అమ్మవారి ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం వేదమంత్రాల నడుమ ఘనంగా జరిగింది. గ్రామానికి చెందిన గోకవరపు గణాధిపతి-లక్ష్మీసరోజ, గోకవరపు పెరుమాళ్లస్వామి-శ్రీవిద్య దంపతులు కర్తలుగా పాల్గొని విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పంచగవ్య మార్జనలు, నవరత్న స్థాపన తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. బహుళ దశమి మూలా నక్షత్ర యుక్త వృషభ లగ్నంలో ప్రతిష్ఠా మహోత్సవాన్ని బ్రహ్మశ్రీ బాదంపూడి సోమేశ్వరశర్మ బ్రహ్మత్వంలో పూజ్యం జగన్నాథశర్మ, విశ్వనాథశర్మ, మానేపల్లి భాస్కరశర్మల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా నిర్వహించిన అఖండ అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. నూతనంగా ప్రతిష్ఠించిన అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేయించుకోవాలి

ముమ్మిడివరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రైతులంతా ఈనెల 5వ తేదీలోపు రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంత్‌కుమార్ పేర్కొన్నారు. పీఎం కిసాన్, పెట్టుబడి సాయం, పంట బీమా, రాయితీపై సూక్ష్మ పోషకాలు, అన్నదాత సుఖీభవ, రాయితీపై యంత్ర పరికరాలు, పంట రుణాలపై వడ్డీ రాయితీ, సూక్ష్మ సేద్యం వంటి రాయితీలు పొందేందుకు రైతులంతా రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేయించుకోవడం తప్పనిసరి అన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు అనుసంధాన చేసిన మొబైల్ నంబరుతో గ్రామరైతు సేవాకేంద్రాలకు వెళ్లి వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు.

సర్పంచ్ రామకృష్ణ మృతికి సంతాపం

పి.గన్నవరం, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): లంకలగన్నవరంగ్రామ సర్పంచ్ పసలపూడి రామకృష్ణ మృతికి గ్రామంలోని జనసైనికులు సంతాపం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన గ్రామ జనసేన పార్టీ సమావేశంలో మంచి వ్యక్తిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. యర్రంశెట్టి వెంకటరమణ, గనిశెట్టి శ్రీని వాస్, మల్లాడి గోపి, యర్రంశెట్టి రామకృష్ణ, పొలమూరి ఆనందరావు, కొండపల్లి అబ్బు, నాగాబత్తుల బుజ్జి, యన్నాబత్తుల నాగరాజు, గూటం కృష్ణంరాజు, అన్నాబత్తుల వెంకటరమణ, చిట్టాల రమేష్, మల్లాడి వెంకట్రావు సంతాపం వ్యక్తం చేశారు.

క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): గొల్లవిల్లి జడ్పీ హైస్కూలు క్రీడా ప్రాంగణంలో ఈనెల26 నుంచి మార్చి ఒకటో తేదీ వరకు ఏఎస్ఆర్ నేషనల్ ఇన్విటేషన్ వాలీబాల్ టోర్నమెంటు నిర్వహణకు ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. టోర్నమెంటు గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆదివారం ఏర్పాట్లను పరిశీలించారు. క్రీడాభిమానుల కోసం ఏర్పాటు చేస్తున్న గ్యాలరీలను పరిశీలించి పలు సూచనలు చేశారు. టోర్నమెంటు ప్రధాన కార్యదర్శి అరిగెల నరేష్ ఏర్పాట్లను ఎమ్మెల్యేకు వివరించారు. దున్నాల దుర్గ, టోర్నమెంటు ఉపాధ్యక్షుడు మద్దింశెట్టి సురేష్, సంయుక్త కార్యదర్శి గుత్తాల సుభాష్‌చంద్రరావు పాల్గొన్నారు.

ఆక్వా రైతులను ఆదుకోండి

మలికిపురం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఒడిదుడుకుల సుడిగుండంలో సాగు చేస్తున్న ఆక్వా రైతులపై నూతనంగా విధించిన సర్వీసు లైన్ చార్జీలను రద్దు చేయాలని కోరుతూ రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు ఆక్వా రైతులు వినతిపత్రం సమర్పించారు. గిట్టుబాటు ధర లేక ఇప్పటికే ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని, కొత్తగా చార్జీలు విధిస్తే ఆక్వా మనుగడకే ప్రమాదమని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు. సఖినేటిపల్లి ఎంపీపీ వీరా మల్లిబాబు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఉపాధ్యక్షుడు ఆకన బాబ్జీనాయుడు, రావూరి నాగు, వీరా వెంకన్నబాబుపాల్గొన్నారు.

దేశ సమగ్రాభివృద్ధిని ప్రతిబింబించిన కేంద్ర బడ్జెట్



మేధావుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి విల్సన్

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ సమగ్రాభివృద్ధిని ప్రతిబింబించిందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్డీ విల్సన్ పేర్కొన్నారు. ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అందరికీ ఆమోద యోగ్యంగా ఉందన్నారు. ప్రధానంగా వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారన్నారు. అమలాపురం ప్రెస్‌క్లబ్ సమావేశ మందిరంలో ఆదివారం బీజేపీ జిల్లాశాఖ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ అధ్యక్షతన కేంద్ర బడ్జెట్‌పై మేధావుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విల్సన్ మాట్లాడుతూ యువతను పారిశ్రామిక రంగంలో ప్రోత్సహించేందుకు ఎంఎస్ఎంఈలకు రూ.2 లక్షల కోట్లు కేటాయించిందన్నారు. త్వరలోనే ఐఐటీ స్థాయిలో నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సౌరవిద్యుత్ తయారీ, విద్యా, వైద్యం మౌలిక సదుపాయాలతో పాటు పలు అంశాలపై ప్రధానంగా కేంద్రం దృష్టి సారించిందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనంసత్తిబాబు, జిల్లా ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యేడిద దొరబాబు, వ్యాపార సముదాయాల అధ్యక్షుడు నల్లా పవన్‌కుమార్, గోకరకొండ హరిబాబు, కంచిపల్లి అబ్బులు, మేడిచర్ల త్రినాథ్, వంటెద్దు బాబు, డాక్టర్ వీరా ధన్వంతరి, మణికుమారిలతో పాటు పలువురు ప్రసంగించారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

పి.గన్నవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య పాల్పడ్డాడు. గూడిరి వెంకటసతీష్(28)కు తల్లిదండ్రులు లేరు. మానేపల్లి గ్రామం శివాలయం పక్కనే ఒక పూరిల్లులో ఉంటూ కూలీ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం పనికి వస్తానని చెప్పి రాకపోవడంతో ఉదయం సంబంధిత వ్యక్తి ఇంటికి వచ్చి పలకరించగా అలజడి లేకపోవడంతో తలుపులు వద్దకు వెళ్లి చూడగా ఉరి వేసుకున్నట్లు గమనించారు. వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదుతో మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు. అయితే తల్లిని గతంలో కోల్పోయిన ఆ యువకుడి తండ్రి కూడా కొన్నాళ్ల క్రితమే మృతి చెందాడని, చివరకు దిక్కులేని వాడిగా మిగిలిపోయాడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండపేట

కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం. పక్క చిత్రంలో అష్టోత్తర పూజల్లో పాల్గొన్న భక్తులు

వాడపల్లి ఒకరోజు ఆదాయం రూ.5.11లక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి మాఘ ఆదివారం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.5,11,876 వచ్చినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఏసీబీ డిప్యూటీ డైరెక్టర్ రవికుమార్ స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. వేదపండితుల ఆశీర్వచనం అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మాఘమాసం ఆఖరి ఆదివారం కావడంతో వేలాదిగా వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని గోప్రదక్షిణ చేశారు.



స్వామివారి తిరుప్పావడ సేవ నిర్వహిస్తున్న గోవిందమాలధారులు

వాడపల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాఘ ఆదివారాన్ని పురస్కరించుకుని గోవిందమాల ధరించిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు ఫణిశర్మ, అర్చకులు సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో ఆర్వేటి మహోత్సవాన్ని పంట పొలాల మధ్య జరిపారు. ఉత్సవమూర్తులను ఊరేగించిన అనంతరం పంట పొలాల్లో ఆశీనులయ్యారు. ఉత్సవమూర్తులకు అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. సూర్య నమస్కారాలు, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆర్వేటి మహోత్సవం చూడచక్కగా నిర్వహించి స్వామివారికి తిరుప్పావడ సేవాకాలం నిర్వహించారు. వందలాదిగా తరలివచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. గోవిందనామస్మరణతో ఆ ప్రాంతం మారుమ్రోగింది.



స్వామివారికి వెండి జటాఝూట నాగాభరణం అందిస్తున్న భక్తులు

అగస్తేశ్వరస్వామికి వెండి జటాఝూటం అందజేత

ద్రాక్షారామ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో ఉన్న అగస్తేశ్వరస్వామికి లక్షబిల్వార్చన కమిటీ భక్తులు సమకూర్చిన నిధులతో రూపొందించిన వెండి జటాఝూటాన్ని ఆదివారం అందించారు. ఇంద్రగంటి విశ్వనాథశర్మ, పొక్కులూరి తిరుమలరావు ఆధ్వర్యంలో వేద పండితులు పైడిమర్రి సుబ్రహ్మణ్యం, కొండూరి శ్రీనివాస్, గరిగిపాటి శ్రీనివాస్, గరిగిపాటి మధు, చీమలకొండ వినోద్ బ్రహ్మత్వంలో స్వామివారికి వెండి జటాఝూట నాగాభరణం అలంకరించారు. తొలుత సంప్రోక్షణ చేసిన అనంతరం స్వామి వారికి ఏకవారాభిషేకం, బిల్వార్చన, లక్ష్మీగణపతి, రుద్రహోమాలు, పూర్ణాహుతి జరిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కొత్తలంక సతీష్, కొత్తలంక ఎర్రయ్యశాస్త్రి, 23వ వార్డు కౌన్సిలరు వాడ్రేవు సాయిప్రసాద్ భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ధాన్యలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

కె.గంగవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోట గ్రామంలో నిర్మించిన ధాన్యలక్ష్మి అమ్మవారి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం ఘనంగా జరిపారు. ప్రతిష్ఠలో భాగంగా మూడు రోజులుగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ప్రతిష్ఠను పురస్కరించుకుని ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమంలో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.



కోటలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న మంత్రి సుభాష్

శ్రావ్యకు గ్రహంబెల్ అవార్డు పట్ల మంత్రి అభినందన

ద్రాక్షారామ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురానికి చెందిన దంగేటి శ్రావ్య ఇటీవల న్యూఢిల్లీలో గ్రహంబెల్ అవార్డు అందుకుంది. ఇటీవల న్యూఢిల్లీలోని అశోక హోటల్‌లో జరిగిన ఏజీఎస్ గ్రహంబెల్ అవార్డు ప్రధానంలో కేంద్రమంత్రి నుంచి అందుకున్నారు. పట్టణానికి చెందిన దంగేటి శ్రీనివాసరావు కుమార్తె శ్రావ్య భీమవరంలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్టిఫిషియల్, డేటా సైన్సులో బీటెక్ నాల్గవ సంవత్సరం చదువుతోంది. ఆమె తండ్రి రామచంద్రపురం డిపోలో ఆర్టీసీ డ్రైవరుగా పనిచేస్తున్నారు. పదవ తరగతి వరకు రామచంద్రపురంలో ఆమె విద్యాభ్యాసం చేసింది. కాకినాడలోని ఒక జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసింది. గ్రహంబెల్ అవార్డు అందుకున్న ఆమెను మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం, రామచంద్రపురం ఆర్టీసీ డిపో మేనేజరు భాస్కరరావు తదితరులు అభినందించారు.



అవార్డుతో దంగేటి శ్రావ్య

ప్రైవేటు లే అవుట్ దారికి ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నం?



ఆర్అండ్‌బీ రోడ్డు చెంత వున్న ప్రభుత్వానికి చెందిన ప్రహరీ

మండపేట, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) మండపేట మండలం ద్వారపూడిలో ఫ్లైఓవర్ వంతెన చెంతనే వున్న నాలుగురోడ్ల జంక్షన్ వద్ద వున్న ఆర్అండ్‌బి రోడ్డుకు సంబంధించి నిర్మించిన గోడను లేఅవుట్ దారి కోసం గోడను తొలగించేందుకు సిద్ధం అయ్యారు. లే అవుట్ యజమానికి సంబంధించిన స్థలానికి మెయిన్ రోడ్డు నుంచి మార్గం లేకపోవటంతో పక్క మార్గాలు వున్నాయి. దానివల్ల మార్కెట్‌లో స్థలానికి డిమాండ్ ఉండదని లేవుట్‌కు కూతవేటు దూరంలో ప్రభుత్వానికి చెందిన డ్రైన్ రహదారులు భవనాలశాఖ నిర్మించిన రక్షణ గోడ ఉంది. వ్యాపారి కూడలి కావటంతో పాటు ఇక్కడే బస్సులు, ఇతర వాహనాలు ఇదే రోడ్డు నుంచి వెళుతుంటాయి. దీంతో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి లేఅవుట్ నిర్వాహకులు తమ భూమి విలువ పెంచుకునేందుకు ప్రభుత్వ అనుమతి లేకుండా రహదారు లు భవనాలశాఖ స్థలం లోంచి నేరుగా లేఅవుట్‌లోకి రోడ్డు నిర్మించాలని అందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ప్రభుత్వ భూమి నుంచి ప్రైవేటు లే అవుట్‌కు ఎలా దారి ఇస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ద్వారపూడిలో ఆక్రమణల పర్వం జోరుగా సాగుతోంది. ఆక్రమణదారులకు స్థానిక నేతలు, అధికారులు వంతపాడుతున్నారని పలువురు ఆరోపణలు గుప్పిస్తున్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కావటం వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

ముగిసిన విజయదుర్గమ్మ ఉత్సవాలు

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): అంగర చేనేత సొసైటీ సమీపంలోనున్న విజయ దుర్గమ్మ ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. గ్రామ ఆడపడుచులతో పాటు అంగర, పడమర ఖండ్రిక గ్రామస్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. అమ్మవారి ఉత్సవాలు ఆదివారంతో ముగిసినట్లు వారు తెలిపారు.



జెడ్.మేడపాడు వద్ద లాకులు శిథిలావస్థకు చేరటంతో అడ్డుగా వేస్తున్న కర్రలు. పక్క చిత్రంలో లాకుల నుంచి వృథాగా పోతున్న నీరు

కాలం చెల్లిన లాకులు..వృథాగా సాగునీరు

• వంతులవారీ విధానంపై త్వరితగతిన చర్యలు • సమస్య పరిష్కరించాలని కూటమి ప్రభుత్వానికి వినతి

మండపేట, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ కాలంలో నిర్మించిన ఇరిగేషన్ లాకులు శిథిలావస్థకు చేరాయి. లాకుల తలుపులు పనిచేయక కాలువనీరు నిలిచే పరిస్థితి లేక వంతులవారీ విధానం కోసం అటు రైతులు ఇటు ఇరిగేషన్‌శాఖ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన లాకుల పునర్నిర్మాణానికి ఇరిగేషన్ శాఖ తయారు చేసిన ప్రతిపాదనలు కేవలం ఫైళ్లకే పరిమితమయ్యాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 32 వరకు పైగా లాకులు ఉండగా వాటిలో చాలా వరకు కాలం చెల్లినవే ఉన్నాయి. ఇందులో భాగంగా జెడ్.మేడపాడు వద్ద లాకులు శిథిలావస్థకు చేరి తలుపులు పనిచేయటం లేదు. దీంతో రైతులు స్వయంగా తలుపులకు కర్రలు, టార్పాలిన్‌ను కట్టి వంతును కట్టుకున్నారు. ఇక్కడ నాలుగు తలుపులు ఉండగా రెండుతప్ప మిగిలిన రెండూ పనిచేయటం లేదు. తూర్పుడెల్టా కాకినాడకు వెళ్లే కెనాల్‌కు సంబంధించి ముఖ్యమైన లాకులు జెడ్.మేడపాడులో వున్నాయి. ఇవి పూర్తిగా పాడవటంతో పాతవాటి స్థానంలో నూతన లాకులు నిర్మించాలంటే రూ.కోటికి పైగా వ్యయం అవుతుందని అంచనా. తొస్సిపూడి లాకులు కూడా ఉంది. ఇక పంటకాల్వలు గట్లు బలహీన పడటం, ఇరిగేషన్ సిబ్బంది కొరత వెరసి సాగునీరు కాస్తా మురుగు కాల్వల్లోకి పోతోంది. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని తాపేశ్వరం, జెడ్.మేడపాడు, పసలపూడి, వెల్ల, లొల్ల, ఆత్రేయపురం, నడిపూడి, కొత్తపేట, ముక్కామల, చింతల్లంక, నడిపూడి, సమనస, రాజోలు, మురమళ్ల(అన్నంపల్లి), గన్నవరం తదితర ప్రాంతాల్లో వున్న లాకులు కాలం చెల్లినవే. వాటి పునర్నిర్మాణానికి గత ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వంలో రూ.110కోట్ల మేర తయారు చేసిన ప్రతిపాదనలు నేటికీ కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం సాగునీటి ఎద్దడి నేపథ్యంలో లాకుల వద్ద లీకులు లేకుండా సాగునీరు వంతుల విధానంలో పంట పొలా లకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టారు. తాత్కాలికంగా లాకుల వద్ద చర్యలు చేప ట్టినా లీకులు మాత్రం ఆగకపోవటంతో సాగునీరు వృథా తప్పటం లేదు. ఈ ఏడాది సాగునీటి అవసరాలు తీర్చేందుకు పంట చివరి దశలో సాగునీరు అందించేందుకు ఇంజన్‌లు కూడా వినియోగించేందుకు ప్రణాళికను ఇరిగేషన్‌శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. కూటమి ప్రభుత్వమైనా కాలం చెల్లిన లాకుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.



కోటిపల్లి శివాలయంలో సంప్రోక్షణ చేస్తున్న మంత్రి సుభాష్

కోటిపల్లి శివాలయంలో సంప్రోక్షణ పూజలు

కె.గంగవరం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి ఛాయ సోమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ భక్తులతో కలిసి సంప్రోక్షణ కార్యక్రమం చేశారు. మనగుడి-బడి కార్యక్రమంలో భాగంగా ఆలయ ఆవరణను ఆయన స్వయం గా శుభ్రం చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న నవగ్రహ విగ్రహాలతోపాటు గణపతి విగ్రహాన్ని శుభ్రం చేశారు. అనంతరం పేడా మండపం పైన గోపురాలను శుభ్రపర్చారు. కార్యక్రమంలో వాసంశెట్టి సుభాష్ సేవా సమితి సభ్యులు, కూటమి నాయకులు వెంటూరు వీరరాఘవులు చౌదరి, గొడవర్తి రామకృష్ణ, చికట్ల సోమేష్, రాము, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ

ఆలమూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేటలో ఇటీవల జరిగిన ఆల్ ఇండియా మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో ఆలమూరు శ్రీసిద్ధార్థ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారు. టైక్వాండో బ్రౌన్ బెల్ట్ కటాష్ ఏ విభాగంలో గెద్దాడ జాయ్‌కిరణ్ ప్రథమస్థానం, ఎల్లో బెల్ట్ బి వి భాగంలో బండి దైవిక్‌ఆశీష్ ద్వితీయస్థానం సాధించినట్టు గ్రాండ్ మాస్టర్ టి.అబ్బులు తెలిపారు. ఆల్ ఇండియా పోటీల్లో బహుమతులు సాధించిన విద్యార్థులను సిద్ధార్థ హైస్కూల్ డైరెక్టర్ కె.ముల్లారావు, కరాటే కోచ్ వెంకటలక్ష్మి, గ్రాండ్ మాస్టర్ అబ్బులు, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.



ఆలమూరులో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బండారు



మండపేట మండలం ద్వారపూడిలో ప్రచారం చేస్తున్న కూటమినేతలు

పేరాబత్తులను మెజార్టీతో గెలిపించాలి

ఆలమూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరారు. ఆలమూరులో ఆయన నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు పీవీ కుమార్, బీజేపీ నాయకుడు పి.సత్యానందంలతో కలసి ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులతో పాటు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రాయవరం(ఆంధ్రజ్యోతి): కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాజశేఖర్‌ను మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ వీవీవీ చౌదరి అన్నారు. ఆదివారం మండలంలోని కుర్మాపురం గ్రామంలో ఆయన మాట్లాడారు. రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన అన్నారు.

మండపేట(ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలన్నారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ ఆదేశాల మేరకు ద్వారపూడిలో ఆదివారం కూటమినేతలు ఎన్నికల ప్రచారం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు యరగతపు బాబ్జి నేతృత్వంలో కూటమినేతలు గోణం పుల్లయ్య, సత్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం (ఆంధ్రజ్యోతి): వెదిరేశ్వరంలో పేరాబత్తుల రాజశేఖర్ గెలుపు కోరుతూ ప్రచారం చేశారు. ప్రచారంలో భాగం గా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఇంటిం టికి వెళ్లి పట్టభద్రుల ఓట్లను అభ్యర్థించారు.



అంగరలో తడిపొడి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న ఈవోపీఆర్డీ మోహన్



ఆత్రేయపురంలో తడిపొడి చెత్త సేకరిస్తున్న కార్మికులు

పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ఆత్రేయపురం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కార్యదర్శులు, క్లాప్ మిత్రాలు, పంచాయతీ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి తడిపొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో రామన్, ఈవోపీఆర్డీ శేఖర్ ఆధ్వర్యంలో కార్యదర్శులు, సిబ్బంది స్పెషల్ డ్రైవ్ జరిపారు.

కపిలేశ్వరపురం(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఈవోపీఆర్డీ ఎం.మోహన్ అన్నారు. ఆదివారం మండలంలోని అంగర, వల్లూరు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక డ్రైవ్ జరిపారు. ఆయా గ్రామాల్లో తడిపొడి చెత్త సేకరణ, వేరుచేసే విధానం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతిఇంటి నుంచి చెత్త సేకరణ చేసినట్టు కార్యదర్శులు మోహన్, కె.సత్తిబాబు తెలిపారు. కార్యక్రమాల్లో సచివాలయ, వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, పారిశుధ్య కార్మికులు, ఆయా గ్రామస్తులు పాల్గొన్నారు.



సిద్ధమైన స్వామివారి రథోత్సవం

నేడు సంఘమేశ్వరస్వామి రథోత్సవం

మండపేట, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిద సంఘమేశ్వరస్వామి కల్యాణోత్సవాల సందర్భంగా 24న స్వామివారికి రథోత్సవం, 25న నిత్యాగ్ని హోత్రం, బలిహరణ, 26న శివరాత్రి తీర్థం, 27న నిత్యాగ్నిహోత్రం, మార్చి1న ఏడిద గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వహణ అధికారి తెలిపారు. స్వామివారి రథోత్సవానికి సంబంధించి 107 ఏళ్ల చరిత్ర కలిగిన రథాన్ని వినియోగిస్తు న్నారు. 1917లో దీన్ని తయారు చేశారు. శివరాత్రి ముందు దీన్ని బయటకు తీసి స్వామివారి రథోత్సవానికి మాత్రమే దీన్ని వినియోగిస్తారు.

శివరాత్రికి ఆర్టీసీ బస్సులు

రావులపాలెం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రావులపాలెం డిపో నుంచి మహాశివరాత్రి సందర్భంగా ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ రమణ తెలిపారు. ఈనెల 24, 25 తేదీల్లో విజయవాడ, శ్రీశైలంనకు, 26న ద్రాక్షారామ, అంగర, కోటిపల్లి, సామర్లకోట, పిఠాపురం శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. వివరాలకు 99592 25549, 73829 11871లో సంప్రదించాలన్నారు.

చిన్నారికి తులాభారం

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): అంగరలోని వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో చిన్నారి తులాభారం ఆదివారం జరిగింది. ద్రాక్షారామకు చెందిన పసుమర్తి అనిల్, వీరీష దంపతులు 3 నెలల చిన్నారికి పటిక బెల్లంతో తులాభారం నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు కె.బాలబాలాజి ఆధ్వర్యంలో చిన్నారి తులాభారాన్ని వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారి ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో చిన్నారి నానమ్మ, తాతయ్య, అమ్మమ్మ, తాతయ్యలు, కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.



ఆలమూరులో విక్రమ భట్టీశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా విక్రమభట్టీశ్వరస్వామి కల్యాణం

ఆలమూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): శతాబ్దాల చరిత్ర కలిగిన విక్రమభట్టీశ్వరస్వామి వార్ల కల్యాణం ఆదివారం రాత్రి వైభవంగా జరిపారు. పెళ్లి కుమారుడిగా శివయ్యను నంది వాహనంపై ఉంచి ఊరేగించారు. కల్యాణోత్సవాల సందర్భంగా ఉదయం పార్వతి సమేత విక్రమభట్టీశ్వరస్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలను ఆలయ ప్రధానార్చకులు కాళ్లకూరి సూరిపండు ఆధ్వర్యంలో జరిపారు. అమ్మవారికి కుంకుమార్చనలు జరిపించారు. ఆదివారం సాయంత్రం ఊరేగింపు అనంతరం స్వామి, అమ్మవార్లలను ప్రత్యేక వేదికపై ఉంచి కల్యాణం జరిపారు. గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త వంటిపల్లి కాశీవిశ్వనాథం దంపతులు ముత్యాల తలంబ్రాలను అందించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎంఎస్ఆర్ కృష్ణ వీటి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

పి.గన్నవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య పాల్పడ్డాడు. గూడిరి వెంకటసతీష్(28)కు తల్లిదండ్రులు లేరు. మానేపల్లి గ్రామం శివాలయం పక్కనే ఒక పూరిల్లులో ఉంటూ కూలీ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం పనికి వస్తానని చెప్పి రాకపోవడంతో ఉదయం సంబంధిత వ్యక్తి ఇంటికి వచ్చి పలకరించగా అలజడి లేక పోవడంతో తలుపులు వద్దకు వెళ్లి చూడగా ఉరి వేసుకున్నట్లు గమనిం చారు. వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదుతో మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు. అయితే తల్లిని గతంలో కోల్పోయిన ఆ యువకుడి తండ్రి కూడా కొన్నాళ్ల క్రితమే మృతి చెందాడని, చివరకు దిక్కులేని వాడిగా మిగిలి పోయాడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



షెడ్డులోకి చేరిన రథం

అంతర్వేది, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఈనెల4 నుంచి 13వ తేదీ వరకు వైభవంగా జరిగిన లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భీష్మ ఏకాదశి నాడు స్వామి రథంపై వైభవంగా ఊరేగి 16 స్తంభాల మండపం వద్దకు వచ్చారు. రథాన్ని ఆదివారం షెడ్డుకు చేర్చినట్టు ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో వాహనకారులు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయానికి పోటెత్తిన భక్తులు: మాఘమాసం చివరి ఆదివారం కావడంతో అంతర్వేది పుణ్యక్షేత్రానికి భక్తుల తాకిడి పెరిగింది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వేకువజాము నుంచి సముద్ర, నదీ పుణ్యస్నానాలు ఆచరించారు. లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి క్యూలైన్‌లో ప్రధాన గోపురం వరకు వేచి ఉన్నారు. దర్శనం అనంతరం నిత్యాన్నదానంలో ప్రసాదం స్వీకరించారు. మహిళలు వేపచెట్టు వద్ద దీపారాధన చేశారు. భక్తులు, పర్యాటకులు సాయంత్రం బీచ్, లైట్‌హౌస్ పరిసర ప్రాంతాల్లో సందడి చేశారు.

పెళ్లి పెద్దలకు 111 రకాలతో విందు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ర్యాలీ గ్రామానికి చెందిన ఇంద్రజాలకుడు శ్యామ్‌జాదుగర్ తనయుడు ఫిజియోథెరపిస్టు మోహిత్‌కృష్ణకు బండారులంకకు చెందిన ఉప్పుగంటి శ్రీధర్ కుమార్తె ఫిజియోథెరపిస్టు సాయిసీత తో మార్చి 12న వివాహం జరగనుంది. పెళ్లి కూతురుకు సంబంధించిన వాళ్లు, ఆదివారం పెళ్లి కుమారుడు ఇంటికి కార్డు ఇచ్చేందుకు వెళ్లారు. ఈ సందర్భంగా శ్యామ్ జాదుగర్ దక్షిణ అమెరికాకు చెందిన రెండవ ఎల్లో పుచ్చకాయ, మలేషియా మామిడిపండు వంటి 111 రకాల దేశ విదేశాలకు చెందిన పండ్లు, స్వీట్స్‌తో విందును ఏర్పాటు చేశారు. ఈ విందును చూసి పెళ్లి కూతురు తరుపు బంధువులు ఆశ్చర్యానికి గురయ్యారు.



పెళ్లి పెద్దలకు ఏర్పాటు చేసిన విందు